# మోసం


—ఎ.వి. సుబ్బలక్ష్మి



బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చి, చీర కుచ్చెళ్ళు సరిచేసుకుంటున్న నాకు "భౌ భౌ" అంటూ మా కుక్క అరుపు వినిపించింది.

ఆ కుక్క అలా గాబరాగా అరుస్తూ పరుగెట్టిందంటే ఎవరినో వెంబడించి కరవబోయి నట్టే లెక్క. "వచ్చిందెవరో?" అనుకుంటూ, డ్రాయింగు రూము దాటి, వరండాలోకి వచ్చి చూశాను.

మా కుక్క అతి బిగ్గరగా అరుస్తూ, గేటు తీసుకొని లోపలికి ప్రవేశించిన మోటుగా ఉన్న రైతు లాంటి మనిషిని వెంబడిస్తోంది.



'ఛీ ఛీ! వదులు!" అంటూ విదిలించటానికి ప్రయత్నిస్తూ తప్పుకుంటున్నాడతను.

గబ గబా వెళ్ళి "తప్పమ్మా టిమ్మీ! ఇలారా!" అంటూ దాన్ని అందుకోబోయాను.

అది అతన్ని వదలకుండా, నాకు దొరకకుండా తిప్పలు పెడుతోంది.

"కంగారు పడకయ్యా! అలా పరుగులెట్టకు! చెయ్యెత్తావంటే కరుస్తుంది! భయపడకయ్యా!" అన్నాను, దాన్ని పట్టుకోవటానికి ప్రయత్నిస్తూనే.

"కరుస్తుందేమోనని భయం అమ్మగారూ! నాకు కుక్కలంటే చాలా భయం" భయం భయంగా నా వంక చూశాడు. "కరిచిన దగ్గర్నుంచీ చచ్చేచావు!" మాటలాపి భయపడుతూనే నిలబడిపోయాడతను. నేర్పుగా కుక్కను పట్టుకొని, చంక నెత్తుకొని నిలబడ్డాను.

ఇంతలో, లోపలి నుంచి, ఇల్లు గల వాళ్ళమ్మాయి బయటకు వచ్చింది.

"దండాలమ్మగారూ!" చెయ్యెత్తి ఆ అమ్మాయికి నమస్కారం పెట్టాడు.

సంగతేమిటన్నట్లు ప్రశ్నార్థకంగా చూసిందా అమ్మాయి. విషయం తెలుసుకుందామన్న కుతూహలంతో అలాగే నిలబడ్డాను.

అతను నా వైపు తిరిగాడు.

"అమ్మగారూ! మేం చాలా దూరం నుంచి వస్తున్నాం. మా అమ్మాయిని తొలిచూలు పురుటికి తీసుకు వస్తున్నా అనుకోకుండా, అమ్మాయికి నొప్పులొచ్చాయి. బస్టాండు లోనే ప్రసవించింది. చూస్తే పొరుగూరు. చేతిలో దండిగా డబ్బులేదు. పుట్టిన పిల్లగానికి కప్పను పాత బట్టలు లేవు" నా ముఖంలోకి చూస్తూ ఆగాడు. కుక్క చంకలో ఉండే, చిన్నగా మొరుగుతోంది.

"అందుకని మీ లాంటి దయగల తల్లుల్ని పాత గుడ్డలు ఇమ్మని అడుక్కుంటున్నాను. దయుంచండి" అడగలేక అడుగుతున్నాడు పాపం!

మనిషిని చూస్తే, మంచి వాడు లాగానే ఉన్నాడు. వేషధారణను బట్టి రైతయి ఉంటాడని అనుకున్నాను. మనసులో అతని నిజాయితీని బేరీజు వేసుకుంటు న్నాను.

జవాబు చెప్పకుండా నిలబడ్డ మమ్మల్ని చూచి, తనదైన ధోరణిలో ఇంకా ఏదో చెప్తున్నాడు.

"మాది, ఈ ప్రక్క పల్లెటూరేనండి. మాకు కాస్త

## ఇదో రకం మోసం!

దారిదోపిడీలు, గృహదోపిడీలు, రైళ్ళ దోపిడీలు, బ్యాంకు దోపిడీలు, బస్ దోపిడీలే గాక ఈ మధ్య సరికొత్తగా సినిమా హాళ్ళలో కూడా నిలువు దోపిడీలు ప్రారంభమయ్యాయి.

వినోదం కోసం వెడితే విషాదం మిగిలిన సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల ఒకామె సినిమా చూడడానికి రాజమండ్రిలోని ఓ థియేటర్‌కు వెళ్ళింది. ఆ సినిమా క్రొత్తగా వచ్చింది కావడంతో టిక్కెట్లు లేక ఒకామె బయట నిల్చున్నారు. ఇంతలో ఒక స్త్రీ 'టిక్కెట్ కావాలా రండ మా అక్క సినిమాకు వస్తానందని టిక్కెట్ తీసాను. ఆమెరాలేదు'' అంటూ సినిమాహాల్లోనికి తీసుకువెళ్ళింది.

ఇంటర్వెల్ అయిన తర్వాత అమె చేతిలో రెండు స్వీట్లు తెచ్చి ఒక స్వీటు తీసుకోమని బలవంతపెట్టగా తప్పని పరిస్థితిలో టిక్కెట్ దొరకక సినిమాకు వెళ్ళినామె ఒక స్వీటు తీసుకొని చప్పరించింది. స్వీటు తినగానే ఆమెకు తలతిరుగుతున్నట్టు అనిపించి స్పృహ కోల్పోయింది. ఈ క్షణం కోసమే ఎదురుచూస్తున్న అపరిచితురాలు ఆ చీకట్లో ఆమె ఒంటిపైనున్న నగలు మంగళసూత్రాలతో సహా తీసుకుని పలాయనం చిత్తగించింది.

సినిమా పూర్తయినా లేవకుండా ఉన్న స్త్రీని చూచి సినిమాహాలు యాజమాన్యం వారు స్థానిక ప్రయివేటు నర్సింగ్ హోమ్‌కు తరలించగా స్పృహలోకి వచ్చి జరిగిన విషయం చెప్పింది.

కాబట్టి రైళ్ళలో కాని, బస్సుల్లోకాని ఎక్కడైనా సరే అపరిచితులు దేవుని ప్రసాదం అని చెప్పి పెట్టినా ఏమీ తినకండి.

—కడలి పార్వతీదేవి, రాజమండ్రి

పాల ముంది. వ్యవసాయం చేసుకుని బ్రతుకుతున్నాం. మీ ఋణముంచుకునే మనిషిని కాదండి. రేపుటెల్లుండి, కూరలోకి మంచి ములక్కాయలు తెస్తాను. మీకు తెలియదు కాని, మా దొడ్లో ములక్కాయలు చాలా లావుగా, రుచిగా ఉంటాయి. కూరొండుకు తింటే మీకే తెలుస్తుంది. అమ్మగారూ!'' అంటూ నా ముఖంలోకి చూశాడు.

''తల్లీ బిడ్డల్ని బస్టాండులో వదిలేసి వచ్చాను. ఏ పాత చీరో, లుంగీయో, మీ పేరు చెప్పి దయచేయండి! మీ పుణ్యం ఊరికేపోదు!'' చాలా నమ్రతగా, జాలికలిగేలా మాట్లాడుతున్నాడు.

నా మనసు కరిగింది. ''అయ్యో! పాపం! పిల్లని పురుటికి తీసుకువస్తూ, పాత గుడ్డలు తెచ్చుకోకుండా, ఎలా బయలుదేరారయ్యా? పోనీ మగాడివి, నీకు తెలియదనుకో! ఆడవాళ్ళకయినా బుద్ధుండొద్దూ?'' మందలింపుగా అన్నాను.

''ఏంటో నమ్మగారూ! బస్సులో గుడ్డల సంచీ, ఎవరో కాజేశారు. బస్సు దిగి, చూస్తే సంచీ లేదు. అంతా ఖర్మ! గంటాగితే ఇంటికి చేరే వాళ్ళం. ఇంతలోకి అబానయింది''

అతని కళ్ళలో, నీళ్ళు గిర్రున తిరిగాయి.

నాకు పుట్టెడు జాలేసింది.

''ఇంట్లో పాత గుడ్డ లేమీ లేవయ్యా! నిన్ననే స్టీలు సామాను. వాడికి ఊడ్చి పెట్టేశాను. లేకపోతే పాతగుడ్డలదేం భాగ్యం?'' ఆలోచిస్తూ అన్నాను.

''నిన్ననే మీతోపాటు, మా అమ్మగారు కూడా పాత గుడ్డలన్నీ స్టీలు సామాన్ల వాడి పరం చేశారాంటీ!'' అన్నది ఇంటిగల వాళ్ళమ్మాయి.

''ఏదో ఒక పాతబట్ట అమ్మగారూ! చిన్న దుప్పటి గుడ్డయినా పని జరుగుతుంది. మీ దయ!'' నీరసంగా అరుగు మీద చతికిలబడ్డాడు.

ఏదో ఒక పాతబట్ట వెతికి ఇద్దామని లోపలికి వెళ్ళాను.

బీరువా అంతా గాలించాను, అన్నీ ఇస్త్రీ మడతలే. పాతచీర కాదుకదా, పాత లంగా గుడ్డ కూడా లేదు.

తరువాత మా వారి అల్మారా మీద దాడి చేశాను. నిన్న నా దృష్టి నుంచి, ఏ లుంగీ గుడ్డా తప్పించుకోలేక పోయిందని తెలుసుకున్నాను.

ఆ పైన పిల్లల గుడ్డలు వెతికాను. అన్నీ రోజూ వాడుకుంటున్న గట్టి జతలే.

ఇక టేబుల్ క్లాత్‌లు, దుప్పట్లు, తుండ్లు, డోర్ కర్టెన్లు — అన్నీ కొత్తవే!

''ఏం చెయ్యటం?''

ఏదో ఒకటి ఇవ్వాలన్న గుబులు నన్ను నిలవనివ్వటంలేదు.

హటాత్తుగా, ఎలుక చిన్నగా కొరికిన బెడ్‌షీట్ మీద నా దృష్టిపడింది. వరుపు మీద నుంచి దాన్ని లాగాను.

''ఫరవాలేదు! ఇది పసి పిల్లవాడి పొత్తిళ్ళకు పనికొస్తుంది. మరి ఆ తల్లి సంగతి?'' ఆలోచించగా, కాస్త రంగు వెలిసిన వాయిల్ చీర గుర్తుకు వచ్చింది.

దండెం మీద నుంచి, చీరను అందుకుని, భద్రంగా మడతపెట్టాను.

''ఇవే ఉన్నాయి నాయనా!'' అంటూ ఉదారంగా అతని చేతిలోపెట్టాను.

''దయగల తల్లి వమ్మగారూ! దేముడు మీ బిడ్డల్ని చల్లగా చూడాలి!'' అంటూ కృతజ్ఞతాపూర్వకంగా ఆశీర్వదించాడు.

ఇంతలో, ఇల్లు గలవాళ్ళమ్మాయి కూడా పాత లంగా ఓణీ పట్టుకొచ్చి, ఇచ్చింది.

''పాపగారు, పరీక్ష ఫస్టు మార్కులతో పాసవాలి'' సంతోషంగా ఆ అమ్మాయిని దీవించాడు.

అన్ని గుడ్డల్నీ పొందికగా మడత పెట్టుకొని, చంకన చుట్టి ''రేపటెల్లుండి ములక్కాయలు తెస్తానమ్మగారూ!'' అంటూ బయటకు నడచి, భద్రంగా గేటు వేసి వెళ్ళిపోయాడు.

కష్టంలో ఉన్న సాటి మనిషిని ఆదుకున్నానన్న తృప్తి, నాకెంతో ఆనందాన్నిచ్చింది.

**  **  **

**ఆ** రోజు సాయంకాలం, నేనూ మా వాడూ కలిసి షాపింగుకి బయలుదేరాం.

తిరుగు ముఖంలో, రిక్షా మాట్లాడుతున్న నా కళ్ళు పేవ్‌మెంట్ మీద, వరుసలో పేర్చిన పాతగుడ్డల మీద! అనాలోచితంగా నా కాళ్ళు నిలిచిపోయాయి.

ఉదయాన్నే నా ఉదారతకి నిదర్శనంగా దానం చేయబడ్డ చీర, బేరం చేయబడుతోంది.

అనుమానంగా, అమ్ముతున్న ఆ వ్యక్తిని పరిశీలించి చూశాను. వేషం మార్చినా, అతన్ని నేను గుర్తించగలను.

''ఎంత మోసం?''

పసిపాప పొత్తిళ్ళలో చేరతాయనుకున్న పాత బట్టలు, బజారులో ఖరీదు చేయబడుతున్నాయ్!

నిస్సత్తువగా నిలబడ్డ నాకు ''అమ్మా! ఏమయింది? అలా నిలబడిపోయావేం?'' అంటున్న మా వాడి ఆసరా ఎంతో అవసరమనిపించింది. □